క్లుప్తంగా

నేడు మృత్యుంజయ గాయత్రి యజ్ఞం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల సమీపంలోని భక్తమార్కండేయ ఆలయంలో సోమవారం ఉదయం 7 గంటలకు మృత్యుంజయ గాయత్రి యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్తబృందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. లోక కల్యాణార్థం ప్రతి సోమవారం నిర్వహించే యజ్ఞానానికి ఆర్యస మాజ్ కమిటీ సభ్యులు, ప్రాంతవాసులు హాజరుకావాలని కోరారు.

మున్నూర్ రవిపై దాడి

మహబూబ్‌నగర్ క్రైం: ఉద్యమకారుడు మున్నూర్ రవిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. వివరాలిలా.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మైత్రి ప్రింటింగ్ ప్రెస్ దగ్గర ఉన్న సమయంలో మున్నూర్ రవిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. దీంతో గాయపడిన రవిని చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మైత్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు కల్వకుర్తి రోడ్డులో ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అధిక లోడ్ కారణంగా ఆదివారం ఉదయం 10.30 గంటలకు పాడయ్యింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని ఇళ్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని కౌన్సిలర్ సతీష్ ఏడీ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సెలవు దినం అయినప్పటికీ ఏఈ కిరణ్, సిబ్బందిని పంపించి క్రేన్ సహాయంతో పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి మధ్యాహ్నం 1.30 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం అందజేత

మహబూబ్‌నగర్ రూరల్: మిత్రుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ధర్మాపూర్‌కు చెందిన బైని వెంకటేష్ ఆదివారం చనిపోగా.. విషయం తెలుసుకున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. అలాగే 1985– 86 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సైతం గ్రామానికి చేరుకుని తమకు తోచినంత ఆర్థిక సహాయం చేసి వెంకటేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వివాహిత అదృశ్యం : కేసు నమోదు

రాజాపూర్: భర్తతో గొడవపడిన భార్య ఇంటి నుంచి వెళ్లిపోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బాలానగర్ మండలం గోరిగడ్డతండాకు చెందిన జర్పులగమ్మి కూతురు సరిత అదేతండాకు చెందిన నేనావత్ అరుణ్ ప్రేమించుకొని పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అయితే శనివారం భార్యాభర్తలు ఇంట్లో గొడవ పడటంతో సరిత ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయం సరిత తల్లి గారి ఇంటి వద్ద ఆరాతీయగా అక్కడికి కూడా రాలేదని చెప్పడంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సరిత తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే చేయూత



జడ్చర్ల: పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో ఆదివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి వ్యాపారులతో ముచ్చటిస్తూ సరదాగా గడిపారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న చిన్నారి అఖిలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పలకరించారు. చిన్నారి వాలకాన్ని చూసి మంచి డ్రెస్ ఇప్పించేందుకు చొరవ చూపారు. వెంటనే పక్కన ఉన్న వస్త్ర దుకాణంలో ఓ గౌను కొనుగోలు చేసి చిన్నారికి బహుమతిగా అందజేశారు.

వైన్ షాపులో చోరీ

జడ్చర్ల: పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో గల ఓ వైన్స్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. పట్టణంలోని లక్ష్మీనర్సింహ వైన్స్‌ను శనివారం రాత్రి మూసివేసిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు పైకప్పు రేకులను తొలగించి షాపులోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. షాపులో రూ.5 వేల విలువ గల మద్యం బాటిళ్లను అపహరించారు. ఈ ఘటనపై షాపు మేనేజర్ రవితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలి

- పీసీసీ మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి
- నేటినుంచి జిల్లాకేంద్రంలోనే నిరసన దీక్షలు
- పదో రోజుకు చేరిన పంచాయతీ కార్యదర్శుల సమ్మె



మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని పీసీసీ మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో జేపీఎస్, ఓపీఎస్‌లు చేస్తున్న సమ్మె పదో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. మండల కేంద్రాల్లో చేస్తున్న దీక్షలను ఆదివారం నుంచి జిల్లాకేంద్రానికి మార్చారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వీరి కృషి వల్లనే జాతీయ స్థాయిలో రాష్ట్రానికి 79 జాతీయ అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. అలాంటి పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం హింసించడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9,355 మంది జేపీఎస్‌లు, ఓపీఎస్‌లను కేడర్ స్ట్రెంత్ నిర్ధారించి రెగ్యులర్ చేయాలని, 010 పద్దు కింద జీతాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్యదర్శుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే మహిళా కార్యదర్శులకు వేతనంతో కూడిన 6 నెలల ప్రసూతి సెలవులు, 90 రోజుల చైల్డ్ కేర్ సెలవులు ఇవ్వాలన్నారు. ఏప్రిల్ 11వ తేదీకి నాలుగు సంవత్సరాల ప్రొహిబిషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న వారితోపాటు మిగతా వారిని కూడా రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏ పథకం అమలు చేయాలన్న గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు లేకుండా ఆ పథకాలు ప్రజలకు చేరవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె ప్రగతి, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, ఉపాధి హామీ పనులు ఇలా 33 రకాల పనులను చేస్తారని వివరించారు. పని ఒత్తిడితో అనేక మంది కార్యదర్శులు ఆత్మహత్యలు చేసుకోవడంతోపాటు చాలామంది ఉద్యోగాలను విడిచి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాకేంద్రంలోనే దీక్షలు

పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ ఆదివారం నుంచి జిల్లాకేంద్రంలోనే నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించి వారు పనిచేసిన కాలాన్ని సర్వీసుగా పరిగణించాలని, తమను రెగ్యులర్ చేసేదాక సమ్మెను ఆపేది లేదని హెచ్చరించారు. యూటీఎఫ్ కిష్టయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి లక్ష్మీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు పాండు, రవి, రఘుపతిరెడ్డి, నర్మద, శిరీష, రవి, హాజీ, వెంకట్రాములు, రాకేష్, వెంకటేశ్, మణి, సరస్వతి, శ్రీలత, కృష్ణ, వేణు, జ్ఞానేశ్వర్, సింధూజ, సంతోష్, శ్రీను, చెన్నకేశవులు, మంగమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపు



వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న చెన్నవీరయ్య

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి, కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్నవీరయ్య అన్నారు. కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో ఆదివారం 25వ వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నవీరయ్య మాట్లాడుతూ కరాటే నేర్చుకునేవారు చదువులో కూడా ముందుంటారన్నారు. కరాటే శిక్షణ శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో 25 ఏళ్ల నుంచి ఉచిత వేసవి కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. క్లబ్ విద్యార్థులు నేపాల్, దుబాయ్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ, కార్యదర్శి అబ్దుల్ జకీ, బీఆర్‌ఎస్ నాయకుడు వినోద్, క్లబ్ ఉపాధ్యక్షులు బాలు, మహేందర్ నాయక్, హమీద్ అలీ, కోశాధికారి తిరుపతయ్య, సీనియర్ కరాటే మాస్టర్లు సాలం బిన్ ఉమర్, కేశవ్‌గౌడ్, రవి నాయక్, కె.రవికుమార్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప స్వామి జాతర



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న గ్రామస్తులు

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో బీరప్పస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి గ్రామంలో బీరప్ప ఉత్సవాలు జరుగుతాయి. ఇందులో భాగంగానే ఆదివారం ఉత్సవాలు నిర్వహించారు. మొదటిరోజు బీరప్ప స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల కార్యక్రమాలు, సాయంత్రం బోనాల ఊరేగింపు చేపట్టారు. గొల్ల కురుమలతోపాటు యాదవులు అందరూ గ్రామంలోని రచ్చకట్ట నుంచి పూనకాలు ఊగుతూ బోనాలతో బీరప్ప ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో శకటోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఎన్ని గొర్రెల మందలు ఉన్నాయో వాటి యజమానులు మొక్కుకున్న ప్రకారం స్వామివారి ఆలయం ముందు గొర్రెలను బలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆశన్న, రాములు, పులేందర్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి

భూత్పూర్: వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలో మే డే వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేల కనీస వేతనం, 8 గంటల పనిదినం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాములు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు మైబు, కార్యదర్శి నారాయణ, రమేష్, రాఘవేందర్, బాల్ నర్సింహులు, నాగమణి, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు పుష్పలత, కవిత, రాములు పాల్గొన్నారు.

ఆగ్రో సేవా కేంద్రం ప్రారంభం



దేవరకద్ర: మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. వ్యవసాయానికి సంబంధించి రైతులకు అన్ని రకాల సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ పరంగా వచ్చే సబ్సిడీలు ఈ కేంద్రం ద్వార పొందవచ్చని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిరసన ర్యాలీకి తరలిరండి

మహమ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో చేపట్టే నిరుద్యోగ నిరసన ర్యాలీ, బహిరంగ సభకు ప్రతి కార్యకర్త, నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీ వస్తున్నారన్నారు. ర్యాలీ ఉదయం 11 గంటలకు ప్రారంభమై సరూర్‌నగర్ స్టేడియంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి



స్వామిని పరామర్శిస్తున్న సంఘం నాయకులు

జడ్చర్ల టౌన్: రాష్ట్రంలోని డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మైబు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని బూర్గుపల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంఘ జిల్లా సహాయ కార్యదర్శి స్వామిని పరామర్శించారు. రోడ్డు ప్రమాద వివరాలు తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మైబు మాట్లాడుతూ డప్పు కళాకారులు ఆర్థికంగా వెనకబాటుకు గురయ్యామని, డబుల్ బెడ్‌రూంలలో తప్పనిసరిగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అలాగే కళాకారుల కుటుంబాలకు మూడెకరాల భూమి చొప్పున పంపిణీ చేయాలని ఇది వరకే ప్రభుత్వానికి విన్నవించామన్నారు. ఆయన వెంట ప్రధాన కార్యదర్శి బాలయ్య, సమన్వయకర్త శేఖర్, జిల్లా అధ్యక్షుడు శ్రీను, ప్రధాన కార్యదర్శి రాజు ఉన్నారు. పరామర్శలో భాగంగా స్వామి కుటుంబానికి రూ.5,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అధ్వానపు రహదారితో అవస్థలు



గుంతలు పడిన పొన్నకల్- దాసర్‌పల్లి వెళ్లే మట్టిరోడ్డు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ నుంచి మూసాపేట మండలంలోని దాసర్‌పల్లికి వెళ్లే మట్టి రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతోపాటు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపు నీళ్లు నిలిచి వాహనాలు వెళ్లడానికి కూడా వీలులేకుండా మారుతుంది. దీంతో పొన్నకల్ గ్రామస్తులు దాసర్‌పల్లి వెళ్లడానికి నందిపేట వై జంక్షన్ మీదుగా చెన్నంపల్లి దాటి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. దాసర్‌పల్లి నుంచి పొన్నకల్ వరకు ఉన్న మట్టిరోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి రోడ్డును బాగు చేయిస్తే రెండు గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



గ్రామంలో ఊరేగిస్తున్న బోనాలు



ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని పోతన్‌పల్లిలో కురుమూర్తిస్వామి ఆలయం దగ్గర నూతనంగా దుర్గామాత, ఆంజనేయస్వామి విగ్రహాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా దుర్గామాత, ఆంజనేయస్వామి విగ్రహాలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి భక్తిని చాటుకున్నారు. సాయంత్రం మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు విచ్చేసిన బంధుమిత్రులు, ఆడపడుచులతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ సత్యమ్మ, ఆలయ ధర్మకర్త చిన్నారెడ్డి పాల్గొన్నారు.

పీయూ బీసీ విద్యార్థి జేఏసీ ఎన్నిక



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ బీసీ విద్యార్థి జేఏసీని ఆదివారం బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ చైర్మన్ రాచాల యుగేందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పీయూ జేఏసీ అధ్యక్షుడిగా తాయప్ప, ఉపాధ్యక్షులుగా నాగరాజు, రజనీకాంత్, కోశాధికారిగా శ్రీవిద్య, ప్రధాన కార్యదర్శిగా శివ ఎన్నికవగా.. రాచాల వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నివాస్, పులేందర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి కేరాఫ్ కొల్లాపూర్

ఇక్కడి పండ్లకు జాతీయ స్థాయిలో గుర్తింపు



కొల్లాపూర్ మామిడి పండ్లు

- గత నెల నుంచి మార్కెట్‌లోకి మామిడి..
- బుట్టలు, బాక్సుల్లో ఇతర ప్రాంతాలకు ఎగుమతి
- ఈ ఏడాది భారీగా తగ్గిన దిగుబడి
- ఆర్థికంగా నష్టపోయిన రైతులు



ఈతబుట్టలు అల్లుతున్న మహిళలు

కొల్లాపూర్: రుచికరమైన మామిడి పండ్లకు కేరాఫ్‌గా నిలిచింది కొల్లాపూర్. ఈ ప్రాంతంలో ఎటు చూసిన మామిడి తోటలే అగుపిస్తాయి. మామిడి తోటలకు ప్రసిద్ధిగాంచిన ఈ ప్రాంత పండ్ల కోసం ఎంతోమంది ఎదురుచూస్తుంటారు. జాతీయస్థాయిలో కొల్లాపూర్ మామిడిపండ్లకు గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఏప్రిల్ నెలాఖరు నుంచే మామిడి విక్రయాలు ప్రారంభమయ్యాయి.

34వేల ఎకరాల్లో మామిడి సాగు..

జిల్లాలో మామిడి తోటలను 34,712 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. వీటిలో 70 శాతం తోటలు మామిడి కాపు కాస్తాయి. ఫిబ్రవరి నెలాఖరు నుంచి మామిడికాయల విక్రయాలు ప్రారంభం అవుతాయి. ఏప్రిల్ నెల వరకు మామిడి కాయలను స్థానిక రైతులు వ్యాపారులకు విక్రయిస్తారు. మే నెల నుంచి మామిడికాయలను స్థానికంగానే మాగబెట్టి విక్రయాలు ప్రారంభిస్తారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మామిడిపండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. కొల్లాపూర్‌లో విక్రయాల జోరు పెరిగింది.

తగ్గిన దిగుబడి


జిల్లాలో ఈ ఏడాది మామిడి దిగుబడి భారీగా తగ్గిపోయింది. దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పెద్దమొత్తంలో మామిడికాయలు హైద్రాబాద్ మార్కెట్‌కు రావడం, విదేశాలకు ఎగుమతులు లేకపోవడం వంటి కారణాల వల్ల ఈసారి మామిడి కాయలకు సరైన ధర లభించలేదు. మార్కెట్‌లో మొదట కేజీ రూ.95 పలికిన మామిడి కాయలు, కొద్ది రోజుల్లో రూ.30 వరకు చేరాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టాల పాలయ్యారు. కొందరు రైతులు తమ తోటల్లోని మామిడి కాయలను స్థానికంగానే మాగబెట్టి విక్రయాలు చేస్తున్నారు. కేజీ మామిడిపండ్లను రూ.45 నుంచి రూ.65 వరకు విక్రయిస్తున్నారు.

సురభి రాజుల కాలం నుంచే..

సురభి రాజులు తమ సంస్థానాన్ని జటప్రోల్ నుంచి కొల్లాపూర్‌కు మార్చిన తర్వాత పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వంద రకాలకు పైగా మామిడి మొక్కలను తెచ్చి కొల్లాపూర్‌లోని సురభిరాజుల పెద్ద తోటలో నాటారు. ఆ తోటలో పండిన మామిడిపండ్లను నిజాం నవాబులతో పాటు, బ్రిటీష్ పాలకులకు కూడా పంపేవారు. నేటికీ ఇతర దేశాల్లో ఉండే వారికి స్థానికులు మామిడిపండ్లను పంపిస్తూ ఉంటారు. ఇక హైద్రాబాద్‌తో పాటు, ఇతర ప్రాంతాల్లో ఉండే అధికారులు, నాయకులకు స్థానికులు పెద్దమొత్తంలో మామిడిపండ్లను పంపిస్తూ ఉంటారు.

జిల్లా వివరాలిలా..

నియోజకవర్గం	మామిడి సాగు (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)
కొల్లాపూర్	25,237	1,00,946
అచ్చంపేట	2,418	9,672
నాగర్‌కర్నూల్	2,510	10,042
కల్వకుర్తి	4,547	18,188
మొత్తం	34,712	1,38,848



జిల్లా వ్యాప్తంగా మామిడితోటలు సాగుచేసిన రైతులు : 14,458

మామిడితోనే ప్రత్యేక గుర్తింపు



కొల్లాపూర్ మామిడిపండ్లకు ఎంతో ఖ్యాతి ఉంది. ఇక్కడి పండ్ల కోసం ఇతర ప్రాంతాల ప్రజలు ఎదురుచూస్తుంటారు. ప్రతి ఏడు మాకు తెలిసిన బంధుమిత్రులకు, అధికారులకు, నాయకులకు ఈతబుట్టల్లో మామిడిపండ్లను పంపిస్తుంటాము. మామిడిపండ్ల కారణంగానే మా ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభించింది.

– ఏ.సురేందర్‌రావు, ఎన్మన్‌బెట్ల గ్రామం

మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి



జాతీయ స్థాయిలో కొల్లాపూర్ మామిడికి మంచి గుర్తింపు ఉంది. ఇక్కడి నేలలు మామిడి ఉత్పత్తికి అనుకూలంగా ఉంటాయి. సురభి రాజుల కాలం నుంచి ఇక్కడి మామిడిపండ్లకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మామిడికి సరైన మద్దతు ధర కల్పించాల్సిన అవసరం ఉంది. దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ ధరలు మాత్రం పెరగడం లేదు. దీంతో రైతులు ఆర్థికంగా చాలా నష్టపోయారు. మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పెద్దూరి లక్ష్మయ్య, మామిడి రైతు, కొల్లాపూర్

ఈత బుట్టలు ప్రత్యేక ఆకర్షణ

కొల్లాపూర్ మామిడిపండ్లకు ప్రత్యేక గుర్తింపు రావడానికి రెండు రకాల కారణాలు ఉన్నాయి. ఇక్కడి నేలలోని పోషకాల కారణంగా మామిడిపండ్లు రుచికరంగా ఉండటం మొదటి కారణం కాగా, ఈ పండ్లను ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు వినియోగించే ఈత బుట్టలు రెండో కారణం. కొల్లాపూర్ మామిడిపండ్లను ఈత బుట్టల్లో తీసుకువెళితే అదో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈతబుట్టలను స్థానికంగా ఉండే ఎరుకలి కులస్తులు తయారుచేస్తారు. ఇటీవల కాలంలో ఇతర కులస్తులు కూడా వాటిని తయారుచేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో ఈత బుట్టను రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. బుట్టల ధర పెరగడంతో కొందరు అట్టా పెట్టెల్లో పండ్లను భద్రపర్చి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.